

ఎన్నారై ముచ్చట్లు

-సత్యం మందపాటి



(గతసంచిక తరువాయి)

18. పిచ్చి వాళ్ళ స్వర్గం

పిచ్చివాళ్ళ స్వర్గం!

ఎవరి పిచ్చి వాళ్ళకానందం!

ఇలాటి సామెతలు కొన్ని వున్నాయి.

కానీ ఈ వ్యాసంలో పిచ్చి అన్నది మానసిక రుగ్మతలకు సంబంధించినది కాదు.

అలాటి వ్యాధులున్న వారి గురించి వ్యంగ్యంగా వ్రాసేటంత మానసిక పిచ్చిలో కూడా నేను లేను.

అందుకని ఇది ప్రతి మనిషి ప్రవర్తనలోనూ, ఆలోచనలలోనూ వున్న రకరకాల పిచ్చి పిచ్చిని గురించి సరదాగా వ్రాద్దామనుకుని, సోదాహరణంగా వ్రాస్తున్న వ్యాసం. మీరు కూడా ఈకలు పీకకుండా అలానే చదవుతారని నా కోరిక.

పైన అన్నట్టు ప్రతివాళ్ళకీ ఏదో ఒక పిచ్చి వుంటుంది. మనిషికో పిచ్చి అనటం కూడా మనం వింటున్నాం కదా, బుడుగు భాషలో హదన్నమాట. అవి పిచ్చి ఆలోచనలు కావచ్చు. పిచ్చి కోరికలు కావచ్చు. పిచ్చి పనులు కావచ్చు. పిచ్చి సంభాషణలు కావచ్చు. అలాటివేవైనా కావచ్చు. కొంతమందికి అలాటి పిచ్చి మంచికి అయితే, కొంతమందికి అంతమంచివి కాకపోగా వాళ్ళనిగానీ, ఇతరులనిగానీ కుచింతో, కుంచెడో ఇబ్బంది పెట్టేవి కావచ్చు.

తెలుగులో ఈ 'పిచ్చి' అనే మాటని ఎన్నో రకాలుగా వాడతారు.

స్నేహిత్‌కి స్నేహితులన్నా, స్నేహమన్నా విపరీతమైన పిచ్చి. అంతేకాదు. బంధువులంటే పిచ్చిన్నర పిచ్చి. గూఢ మిత్రులు, గాఢ బంధువులతోపాటూ ఇటు ఇరుగువారినీ, అటు పొరుగువారినీ ప్రేమించేటంత పిచ్చి మనందరిలో వుంటే భూలోకమే స్వర్గతుల్యం అవుతుంది కదూ! పిచ్చి అనేది ఇక్కడ ప్రేమ. ఎంతో ఇష్టమైన ప్రేమ.

మీరాకి మిరపకాయ బజ్జీల పిచ్చి. రోజూ అరడజను లాగిస్తాడు. ఈ పిచ్చిలో నాలిక కోసుకునేటంత 'రుచి' వుంది.

ద్రౌపదికి చీరలంటే ఎంత పిచ్చో చెబితే మీరు నమ్మరు. ఆవిడ బీరావా తలుపు తీస్తే అవన్నీ క్రింద పడిపోయేలా నిండుగా వుంటుంది. దాన్ని వాడుక భాషలో వీర చీరల పిచ్చి అంటారేమో!

కూరగాయలు కొనేటట్టుగా నగలు కొనుక్కుంటుంది నళిని. అందుకే వాళ్ళాయనకి క్రెడిట్ కార్డు స్టేట్‌మెంట్ చూసినప్పుడ్సల్లా పిచ్చి కోపంతో గుండె పిచ్చి స్పీడులో కొట్టుకుంటుంది. అదొకరికి సహజమైన నగల పిచ్చి, ఇంకొకరికి ప్రమాదకరమైన కోపం పిచ్చి.

'ఈవిడకి ఎన్ని నగలున్నా ఆయన గుండె కొట్టుకోవటం ఆగిపోయేదాకా అలా కొంటూనేవుంటుంది' అంటుంది అనసూయ, అసూయ అనే పిచ్చితో. ఇది మిస్సమ్మ సినిమాలో పింగళి మహాశయుడు వ్రాసిన 'ఈసునసూయల' పిచ్చి.

'చూడరా, ఈ మాచ్‌లో కింగ్ కొహ్లీ పిచ్చ కొట్టుడు కొడతాడు' అంటాడు కొహ్లీ ఫాన్. ఇది వీరాభిమానం పిచ్చి.

ఒక క్రికెట్ మాచ్ ఓడిపోయినప్పుడు 'మేము టాస్ గెలిచినా, ఈ పిచ్చిని సరిగ్గా చదవలేనందున ఓడిపోయాము'

అని కేప్టెన్ ధోనీ అన్నాడని ఆరోజుల్లో ఒక తెంగ్లీష్ పేపర్ వాడు వ్రాశాడు. ఆంగ్లంలో అసలు ధోనీ ఏం చెప్పాడంటే, "We

didn't read the pitch right. That's why inspite of winning the toss, we lost the match" అని. ఇది తెంగ్లానువాద పిచ్చి.

ప్రతివాళ్ళకీ ఏదో ఒక పిచ్చి వుంటుందని అనుకున్నాం కదా!

మరి నాకున్న పిచ్చి ఏమిటో ముఖమాట పడకుండా ముందే చెప్పెస్తే బాగుంటుందేమో.

నాకు ఒకటి కాదు అలాటి పిచ్చిలు ఎన్నో వున్నా, నాకు ఏవి కొంచెం ఎక్కువో రెండు చెబుతాను.

ఒకటిః విషయపరంగా కల్చరల్ ఆంథ్రొపాలజీ. అంటే సాంస్కృతిక మానవ శాస్త్రం అంటే పిచ్చి. ఎన్నో పుస్తకాలు చదివి అర్థం అయినవీ, అర్థం కానీవీ అన్నీ జీర్ణించుకున్నాను. ఇంకా అర్థమయేదాకా చదువుతూనే వుంటాను. ఇక్కడ అమెరికాలో నా చుట్టూ ఎన్నో రకరకాల దేశాల మనుష్యులు వుండటం, వారి సంస్కృతులలో ఎన్నో వైవిధ్యభరితమైన ప్రవర్తనలు, విషయాలు నా 'పిచ్చి' విశ్లేషణకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

ఇక రెండవదిః తెలుగు భాషా, సాహిత్యాలంటే నాకు ఎనలేని పిచ్చి. ఆ పిచ్చి నేను ఎన్నో కథలూ కమామిషులూ వ్రాయటానికి దోహదం చేస్తూనే వుంది. అంతేకాదు కొన్ని ఇతర భాషల గురించి కూడా ఎంతో తెలుసుకోవటానికి ఆసక్తి కలిగించింది.

ఆమధ్య ఎవరో అడిగారు 'మీరింకా కథలు, నవలలు వ్రాస్తున్నారా' అని. 'చదవటం నా ఊపిరి. వ్రాయటం నా ప్రాణం. ఆ రెండూ మానేస్తే నేను వుండను.' అన్నాను. ఇది నా స్వంత పిచ్చి. వయసు మీరుతున్న కొద్దీ నన్ను ప్రతిరోజూ ప్రశాంతంగా, సంతోషంగా వుంచుతున్న పిచ్చిన్నర పిచ్చి.

అలాగే నా వయసులోనే వున్న చిరకాల ప్రియమిత్రుడు, దగ్గరలోనే వున్న ఒక మహానగర తెలుగు సామ్రాజ్ఞానికి రాజు. తెలుగు భాష కోసం ఒక చెవిని, తెలుగు సాహిత్యం కోసం ఇంకొక చెవిని కోసేసుకుని, చెవులు సరిగ్గా వినపడక ఆరోగ్యం కొంచెం ఇబ్బంది పెడుతున్నా, పడుతున్నా ప్రతి రెండేళ్ళకీ ఇంకా అమెరికా సాహిత్య సదస్సులూ, ప్రపంచ సాహిత్య సదస్సులూ నిర్వహిస్తూనే వున్నాడు. అది ఆయన పిచ్చి.

అలాటి మిత్రులే కొంతమంది స్వంత లాభం పూర్తిగా మానుకుని, అంతర్జాల తెలుగు పత్రికలు 'చేతి చమురు భాగోతంతో', ఎంతో కష్టపడుతూ, అయినా ఎంతో ఇష్టపడుతూ ఆ పత్రికలు నడుపుతూనే వున్నారు.

ఇవన్నీ మాతృభాషా పిచ్చులు. తెలుగు సాహిత్య మందార మకరంద మాధుర్యపు పిచ్చులు.

కొన్ని సినీ యుగాల క్రితం ఆల్‌రౌండ్ కళాకారిణి పాలువాయి భానుమతిగారు పాడిన "ప్రేమా.. పిచ్చీ.. ఒకటే" అనే ఒక మంచి పాట గుర్తుకొస్తున్నది. అవును మనకి దేనిమీదైనా ఎంతో ప్రేమ వుంటే ఆ ప్రేమా, పిచ్చి ఒకటవుతాయి అని. పైన చెప్పినవన్నీ అంతే కదా మరి!

అందుకే మేము సైకియాట్రిస్టు స్నేహితుడైన ఒక డాక్టర్‌గారికి మన్మధుడు అని పేరు పెట్టుకున్నాం. మనస్సుని మధించేవాడు అని!

మన జీవితాలు అంతర్జాల సూపర్ హైవే ఎక్కిన తర్వాత, ఇలాటి పిచ్చులు ఇంకా ఎక్కువయాయి.

ఈ పిచ్చిలన్నీ అంత మంచి పిచ్చిలేమీ కాదు. కొన్ని పిచ్చులు మాత్రం పుచ్చిపోయిన పిచ్చి పిచ్చిలే.

ఉదాహరణకి, నా చిన్నప్పుడు మా వూళ్ళో శంకర్రావు అనే సైకియాట్రిస్టుని పిచ్చి డాక్టరుగారు అని కొందరు 'దూరపు' పేషంట్లు అంటుంటే, పిచ్చి శంకరయ్య అని కొందరు 'దగ్గర' రోగులు అనేవారు. ఆయన మాత్రం ఎంతో మంచి డాక్టర్‌గారు. ఇది పిచ్చి వాగుడు వాగే వాళ్ళ నోటి దురద పిచ్చి.

కులభూషణ్‌కి కుల పిచ్చి. ఏమాత్రం నటన తెలియని తన కుల నటవిహీన జీరోల సినిమాలే చూస్తాడు. తన కులచవటలకే ఓటేస్తాడు. తన కులమే అతనికి ముఖ్యం. మిగతా ప్రపంచం ఒక మిథ్య.

కులదూషణ్‌కి కులపిచ్చే కాక, మిగతా కులాలంటే ద్వేషం కూడాను. ఆ ద్వేషం రోజూ ప్రొద్దున్నా, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రీ చూపిస్తూనే వుంటాడు.

మమతకి మత పిచ్చి. సమతకి మిగతా మతాలంటే పిచ్చ ద్వేషం కూడాను.

మా అమెరికన్ స్నేహితురాలు బ్రాండీకి బ్రాండ్ నేమ్స్ వస్తువులూ, బట్టలూ అంటే విపరీతమైన పిచ్చి. మనం మనకి ఇష్టమైన మామూలు వస్తువులూ, దుస్తులూ కొనుక్కుంటే తక్కువగా చూస్తుంది. అంతేకాదు అందరిక ముందూ మనల్ని ఎద్దేవా చేస్తూ ఎక్కువ చాటింపు కూడా వేస్తుంది. దాన్నే బ్రాండున్నర పిచ్చి అంటాను నేను.

ఎవరికైనా తమ కులమన్నా, మతమన్నా, రంగూ, రుచీ, డబ్బూ, దస్కమన్నా ఇష్టం వుంటే తప్పులేదు. మిగతా వారిని హేళన చేయటం, అసహ్యించుకోవటం చేస్తే ఎలా? ఇది ద్వేషాల పిచ్చి అయిపోతుంది.

భారతంలో రాజకీయ నాయకులకి డబ్బు పిచ్చి. పదవి పిచ్చి. ప్రజాస్వామ్య పాలనలో కూడా వాళ్ళ పిల్లలకి నాయకత్వం వంశపారపర్యంగా ఇవ్వాలనే దుర్బుద్ధి పిచ్చి. వాటి కోసం ప్రజలకి ఉచితాలు ఇవ్వటమే కాక, నోట్లు చల్లి ఓట్లు పండించటంలాటి, సారా పోసి నిద్రబుచ్చటంలాటి మత్తులో వుంచి సింహాసనం దిగని పిచ్చి. దీన్ని 'న' గుణింతం పిచ్చి అంటాను నేను. (నేను, నేనే, నాకు, నాకే, నాది, నాదే, నన్ను, నన్నే మొదలైనవన్నమాట)

ఈనాటి తెలుగు సినిమాలు తీసే తెలుగువాళ్ళకి సెక్సూ, వయొలెన్స్, విపరీతమైన తాగుడూ, డ్రగ్సూ, ఫటాఫటా కొట్టుకోవటాలు, వందమందిని చిటికెన వేలితో చిటుక్కున చంపటాలు, ఆవకాయ పెట్టటానికి టెంక మామిడికాయలు కోసినట్టు పెద్ద కత్తితో మెడలు నరికేయటాలూ, గార్ధభ గాత్రాలు, పిచ్చ బాదుడు సంగీతమే కాకుండా, మన తీయని తెలుగు భాషని ఎన్ని విధాల చంపేయాలా అనే ఆలోచనల పిచ్చి. ఇలాటివి చాల వున్నాయి.

మన తురుపు ముక్కకి రంగు పిచ్చి. రూపు పిచ్చి. డబ్బు పిచ్చి. మద పిచ్చి. సెక్స్ పిచ్చి. అబద్ధాల పిచ్చి. అహంకార పిచ్చి. నియంత పిచ్చి. బిలియన్లంటే 'భలే చాన్సులే' పిచ్చి. 'న' గుణింతమంటే మూడుమ్ముప్పాతిక పిచ్చి. ఒక్క మాటలో చెప్పాలంటే ఒళ్ళంతా దురదల పిచ్చి. గోకుడు పిచ్చి. మరి అతనొక అసత్య హరిశ్చంద్ర మహారాజు మరి!

సావన్ అనబడే ఒక సాఫ్ట్‌వేర్ అతనికి ఒక వింతైన అలవాటుంది. రోజుకి ఒకటో రెండో సెల్ఫీలు తీసుకుని ముఖపుస్తకంలో పెట్టేస్తాడు. అందరూ అతన్ని సెల్ఫీ సావన్ అని పిలుస్తారు. ఆయన సెల్ఫీలకి ఎక్కువ 'లైకులు' చేయటం లేదని ముఖమాటం లేకుండా ముఖపుస్తకం మిత్రుల్ని 'అన్‌ఫ్రెండ్' చేశాడు. అదో అహంభావ 'పిచ్చి'.

ప్రతిమ తను చేసే ప్రతి పనినీ, తినే ప్రతి ఆహార పదార్థాన్నీ సోషల్ మీడియాలో పెట్టాలి అని ప్రతిజ్ఞ చేసిందేమో ప్రతిరోజూ ప్రొద్దున్నే రెండు పూరీల, మూడు ఇడ్లీల అల్పాహారం, మధ్యాహ్నం ఫుల్ తాలీ మీల్, సాయంత్రం ఉపవాసం కనుక మూడు చపాతీలు+శెనగల కూర, ఆరు సాంబారు ఇడ్లీల ఫొటోలు పెట్టి కానీ తినదు. అది ముఖపుస్తకానికి ఇచ్చే నైవేద్యం సమర్పయామి పిచ్చి.

ఈ హైటెక్ యుగంలో ఇంకా కొన్ని సరదా సంఘటనలు కూడా చూస్తూ వుంటాము.

ఈమధ్య అంతర్జాలంలో ఇలాటి కొన్ని చిట్టి పొట్టి 'పిచ్చి' సరదా కథలు చదివాను. అవి చెబుతాను. చిత్తగించండి.

ఒక ఆదివారం, శివ తన స్నేహితులతో కలిసి ఒక పాత కాలపు అడవి ప్రాంతానికి ట్రిప్‌కు వెళ్ళాడు. అక్కడ ఒక అందమైన జలపాతం ఉంది. మిగతా వారందరూ ప్రకృతిని ఆస్వాదిస్తుంటే, శివ మాత్రం రకరకాల కోణాల్లో సెల్ఫీలు దిగుతూ బిజీగా ఉన్నాడు. అసలు ట్విస్ట్ ఇక్కడే మొదలైంది.

జలపాతం దగ్గర ఒక రాయి మీద నిలబడి, "ప్రకృతి ఒడిలో నేను" (#NatureLover #Peaceful) అని క్యాప్షన్ పెట్టి ఫోటో దిగుతుండగా, శివ కాలు జారి గంగలో పడ్డాడు. అదృష్టవశాత్తూ లోతు తక్కువగానే ఉంది, కానీ రాయి తగిలి కాలు కొంచెం బెణికింది. నీళ్లలో పడగానే ఫోన్ తడవకుండా గాలిలోకి ఎత్తి పట్టుకున్నాడు. నొప్పితో విలవిలలాడుతూనే, ఆ నీళ్లలో పడ్డ స్థితిలో ఒక వీడియో తీశాడు. "గయ్స్, నేను జలపాతంలో పడిపోయాను! చాలా నొప్పిగా ఉంది. ప్లీజ్ లైక్ అండ్ షేర్!" అని లైవ్ పెట్టాడు.

స్నేహితులు అతన్ని కాపాడటానికి వస్తుంటే, "ఆగండి! మీరు నన్ను పైకి లాగుతుంటే వీడియో తీయండి, అది రీల్స్ లో వైరల్ అవుతుంది" అని అరుస్తూనే వున్నాడు.

స్నేహితులు అతన్ని బలవంతంగా ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ కట్టు కడుతుంటే, శివ నొప్పిని భరిస్తూనే మరో సెల్ఫీ తీసి, 'హాస్పిటల్ డైరీస్... వెరీ పెయిన్ ఫుల్" (#StrongMe #HospitalLife) అని అప్‌లోడ్ చేశాడు.

ఆ సాయంత్రం శివకు కాలు నొప్పి కంటే, తను పెట్టిన పోస్ట్‌కు కేవలం పది 'లైకులు' మాత్రమే వచ్చాయన్న బాధే ఎక్కువగా ఉంది.

పక్కనే ఉన్న అతని స్నేహితుడు అన్నాడు, "ఒరేయ్, నువ్వు నీ ప్రాణం కంటే నీ 'ప్రొఫైల్' కే ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నావురా, ఇదే అసలు సిసలైన పిచ్చి!" అని.

శివకి అప్పుడు అర్థమైంది, లోకాన్ని కళ్లతో చూడటం మానేసి, కెమెరా లెన్స్ ద్వారా చూడటం ఎంత పిచ్చి పనో!

ఈరోజుల్లో మనుషులు 'నిజమైన అనుభూతి' కంటే 'డిజిటల్ గుర్తింపు' కోసం ఎంత వింతగా ప్రవర్తిస్తారో ఈ కథ చెబుతుంది.

దామోదర్ ఒక ప్రైవేట్ కంపెనీలో మేనేజర్. ఈ మధ్య అతనికి ఒక పిచ్చి పట్టుకుంది, అదే 'హెల్తీ డైట్'. తినే ప్రతి గింజా, తాగే ప్రతి చుక్కా ఆరోగ్యకరంగా ఉండాలని అతను చేసే హంగామా అంతా ఇంతా కాదు.

ఒకసారి దామోదర్ తన స్నేహితులతో కలిసి ఒక రెస్టారెంట్‌కు వెళ్ళాడు. స్నేహితులందరూ హాయిగా బిర్యానీ ఆర్డర్ చేస్తుంటే, దామోదర్ మాత్రం ఒక అరగంట సేపు మెన్యూ కార్డును పరిశోధించాడు.

"అయ్యా! మీ సలాడ్‌లో వాడే ఆకులు ఆర్గానిక్‌వేనా? మీరు వాడే ఆయిల్‌లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఎంత శాతం ఉన్నాయి?" అని ప్రశ్నించి వెయిటర్‌కు చెమటలు పట్టించాడు.

అక్కడ అవేవీ లేకపోవటంతో, చివరికి అతను కేవలం 'ఆవిరితో ఉడికించిన కూరగాయలు' మరియు 'గ్రీన్ టీ' ఆర్డర్ చేశాడు. మిగతా వారు బిర్యానీ తింటుంటే, అతను తన ఫోన్‌లో ఒక యాప్ ఓపెన్ చేసి, ప్రతి ముక్కలో ఎన్ని క్యాలరీలు ఉన్నాయో లెక్కిస్తూ కూర్చున్నాడు.

రెస్టారెంట్ నుంచి బయటకు రాగానే, దామోదర్ కళ్ళు తిరుగుతున్నాయని అన్నాడు.

స్నేహితులు కంగారుపడి, "ఏమైందిరా?" అని అడిగారు.

"ఏం లేదు, నేను తినే క్యాలరీల కంటే, ఆ మెన్యూ కార్డు చదివి వెయిటర్‌తో వాదించడానికి ఖర్చు చేసిన క్యాలరీలే ఎక్కువైపోయాయి. అందుకే నీరసం వచ్చేసింది!" అన్నాడు.

వెంటనే రోడ్డు పక్కనే ఉన్న ఒక బండి దగ్గరికి వెళ్ళి, "నా ఆరోగ్యానికి ఇది మంచిది కాదు" అని గొణుగుతూనే... మూడు ప్లేట్ల వేడి వేడి మిరపకాయ బజ్జీలు మూడు నిమిషాల్లో తినేశాడు.

ఆశ్చర్యపోయిన స్నేహితులు, "ఇప్పుడే కదా హెల్త్ అన్నావు, ఆర్గానిక్ అన్నావు, మరి ఇదేమిటి?" అని అడిగితే. "అదా, ఇవి తింటే వచ్చే 'మానసిక ప్రశాంతత' నా డైట్ కంటే ఎక్కువ ఆరోగ్యాన్ని ఇస్తుందిలే!" అని సమర్థించుకున్నాడు.

చాలామంది మనుషులు సిద్ధాంతపరంగా చాలా నియమాలు పెట్టుకుంటారు కానీ, ఆచరణలోకి వచ్చేసరికి తమ బలహీనతలకు లొంగిపోతారు. అవసరానికి మించిన జాగ్రత్త కూడా ఒక్కోసారి పిచ్చి ప్రవర్తనకు దారితీస్తుంది కదూ!

ఒకసారి ఆస్టిన్‌నించీ శాన్‌హొసే వెడుతూ, గేటు దగ్గర కూర్చుని లాప్‌టాప్‌లో ఏదో వ్రాసుకుంటున్నాను. మధ్యలో తలెత్తేసరికీ సన్నగా, హైహీల్సులో పొడుగ్గా, అందంగా వున్న ఒక తెల్లమ్మాయి అక్కడికే వస్తూ కనపడింది. చేతులూ, కాళ్ళూ కనపడేటట్లు వేసుకున్న ఆకుపచ్చ రంగు గౌను ఆమెకి ఇంకా ఎంతో అందాన్నిచ్చింది కూడాను. ఎర్రటి పెదిమల మీద చక్కటి చిరునవ్వు. వచ్చి నా వెనకాలనే వున్న కుర్చీలో కూర్చుంది. అంటే ఆ అమ్మాయి కూడా శాన్‌హొసేకే వస్తున్నదన్నమాట. మళ్ళీ ఇంకోసారి ఆమెని చూడాలనిపించింది కానీ, వెనక్కి తిరిగి చూస్తే సభ్యంగా వుండదని వూరుకుని, నా పనేదో నేను చేసుకుంటున్నాను.

కాసేపటికి ఆ అమ్మాయి “నేను 101 ఫ్రీవే, బావర్స్ రోడ్డూ కలిసే చోట, ఎంబెసీ స్వీట్సులో వుంటాను ఈ మూడు రోజులూ. నువ్వు సాయంత్రం ఖాళీగా వుంటే, అక్కడికి వచ్చేయి. ఇద్దరం కలిసి డిన్నర్ కి వెడదాం" అంది.

నేనూ అదే హోటల్లో మూడు రోజులుండబోతున్నాను మరి! అందుకే ఆశ్చర్యపోతూ చటుక్కున వెనక్కి తిరిగి చూశాను. ఆ అమ్మాయి ఆ మాటలు నా వేపు తిరిగి చెప్పటం లేదు. సూటిగా శూన్యంలోకి చూస్తూ చెబుతున్నది. "వెరీ గుడ్! అయితే ఆరింటికల్లా వచ్చేయ్" అంటున్నది. చేతిలో సెల్‌ఫోన్ లేదు. కాకపోతే చెవిలో నీలాలు పొదిగిన బంగారపు దుద్దుల బదులు, నీలం పన్ను వుంది. అంటే బ్లూటూత్.

నేను వెళ్ళే జింలో కూడా ఇలాటివి చూస్తుంటాం. పక్కనే ట్రెడ్‌మిల్ మీద ఒక లావాటావిడ, పక్కన ఎవరూ లేకపోయినా పెద్దగా అరుస్తుంటే, ‘ఏమిటి, ఈవిడకు పిచ్చా, ఎందుకిలా అరుస్తుంది’’ అనుకునే వాడిని. ఎదురుగుండా

ఎలిప్టికల్ మీద వున్న ఎమిలీ పెద్దగా పడీపడీ నవ్వుతుంటే, "ఆ మెషీన్ మీదనించీ పడిపోతుందేమో, ఆవిడకి ఇవేం పిచ్చి నవ్వులు" అనుకునేవాడిని. ఎక్కడో, ఎవరో కూర్చుని నవ్వుతుంటారు, కుంటుంటారు. విశాఖపట్నం బాపతు అనుకోటానికి వీల్లేదు, కాకపోతే వాళ్ళ చెవుల్లో నీలం పన్నులు, వాళ్ళని పళ్ళికలించేస్తుంటాయి! పాపం వాళ్ళని ఏమీ అనటానికీ వీల్లేదు. అది పిచ్చి అనుకోవటం మన పిచ్చి. ఎందుకంటే నా చెవుల్లోనూ ఆ బ్లూటూతులున్నాయి మరి! కాకపోతే నేను వాటిని జింలో ఘంటసాల, సుశీల, జానకి మొదలైన వారి ఆపాతమధురాలు వినటానికే వాడతాను. నా కళ్ళల్లోని ఆ ఆనంద తన్మయత్వాన్ని చూసి వాళ్ళు నాకేం పిచ్చి అనుకుంటారో!

పిచ్చిమనసుల పిచ్చి ఆలోచనలతో కూడా ఒక వ్యాసం వ్రాయవచ్చా అనే ఒక పిచ్చి ఆలోచన వచ్చి ఈ వ్యాసం వ్రాశాను. ఈ వ్యాసం బాగుందో, పిచ్చిదో ఇక మీరే నిర్ణయించాలి!

○ ○ ○

(మరో ముచ్చట వచ్చే నెలలో)

COMMENTS